క్లుప్తంగా

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

తాడూరు: మండల కేంద్రంలో వివిధ రకాల అభివృద్ధి పనులకు రూ.50 లక్షల నిధులు మంజూరైనట్లు ఎంపీటీసీ రేణుకమల్లయ్య తెలిపారు. సోమవారం మండలంలోని వార్డులను సంబంధిత పీఆర్‌ఏయూ ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించారు. అవసరమైన చోట సీసీ రోడ్లతో పాటు డ్రైయినేజీలు పనులను చేపడుతామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీసీ రోడ్ల నిర్మాణాల కోసం కొలతలు తీసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వంక నారాయణ, రాములు, మంజు, చంద్రయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో నల్లమల విద్యార్థి ప్రతిభ

మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన కరాటే పోటీలలో నల్లమల విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచింది. గ్రామానికి చెందిన జూలూరు రాఘవేందర్ కూతురు ఆద్విత జిల్లా కేంద్రంలోని గీతాంజలి పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఆదివారం ప్రతిభ కనబర్చిన విద్యార్థినిని ఎస్పీ గైక్వాండ్ వైభవ్ రఘునా ప్రశంసించి అభినందించారు. అనంతరం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

పండ్లు, బ్రెడ్లు పంపిణీ

కొల్లాపూర్: పట్టణంలోని విశ్వశాంతి వృద్ధాశ్రమంలో గాయత్రి విద్యా సంస్థల నిర్వాహకుడు సురగాని శ్రీనివాస్‌గౌడ్ జన్మదినం సందర్భంగా వృద్ధులకు సోమవారం విద్యార్థులు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఉర్సు ఉత్సవాలు

కల్వకుర్తిరూరల్: మండలంలోని జీడిపల్లిలో ఉన్న దర్గా ఉర్సు ఉత్సవాలు మంగళవారం నుంచి నిర్వహిస్తునట్లు నిర్వాహకులు తెలిపారు. 6వ తేదీ రాత్రి 10 గంటలకు గంధోత్సవం, 7న కందూరులు, ఫాతెహాల కార్యక్రమం ఉంటుందని, 8న ఖురాన్ పఠనంతో ఉత్సవాలను ముగుస్తాయని దర్గా నిర్వాహకులు ఖాజాజియావుద్దీన్, పాషామోయినుద్దీన్‌లు పేర్కొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

వెల్దండ: రాష్ట్ర ద్వితీయ విద్యా, జ్ఞానిక మహాసభలను ఖమ్మం జిల్లాలో ఈ నెల 11,12వ తేదీల్లో తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సీహెచ్ వెంకట్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ, గురుకుల పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో అసమానతలు లేకుండా అందరికి సమానమైన విద్య అందించాలన్నారు. అనంతరం మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్రవంతి, ఉపాధ్యాయురాలు ప్రసన్న, లక్ష్మి, అమరావతి తదితరులు ఉన్నారు.

ఏపీజీవీబీ ప్రారంభం



కోడేరు: బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామీణా వికాస్ బ్యాంకు రీజినల్ మేనేజర్ వారణాసి రంజిత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంకు నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ధర్మతేజ, క్యాషియర్ వెంకటేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐలకు సన్మానం

సాక్షి, నెట్‌వర్క్: కోడేరు ఎస్‌ఐ కురుమూర్తి, చారకొండ ఎస్‌ఐ రాజశేఖర్, సిద్ధాపూర్ ఎస్‌ఐగా పవన్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం నాయకులు, సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

వేరుశనగ క్వింటా రూ.7,359

కల్వకుర్తి: కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం వేరుశనగ విక్రయాలు జోరుగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి 115 మంది రైతులు 1,476 క్వింటాళ్ల వేరుశనగను మార్కెట్‌కు తీసుకురాగా.. గరిష్టంగా రూ.7,359, కనిష్టంగా రూ.4,509, మధ్యస్థంగా రూ.7,129 ధరలు వచ్చాయి. కందులు క్వింటా రూ.9,259 ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి భగవంతు తెలిపారు.

నేడు సమీక్ష

కందనూలు: జిల్లాలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో మంగళవారం జిల్లా స్థాయి వార్షిక సమీక్ష నిర్వహించనున్నట్లు డీఈఓ గోవిందరాజులు ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో నిర్వహించే సమావేశానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు విధిగా హాజరు కావాలని కోరారు.

పేదలకు అండగా ఉంటాం



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట: పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే డాక్టరు చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజా భవన్(క్యాంప్‌ఆఫీస్)లో ఆయన అచ్చంపేట, బల్మూర్, ఉప్పునుంతల మండలాలకు చెందిన 300 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తూచతప్పకుండా అమలు చేస్తోందన్నారు. ఆర్డీఓ గోపిరాం, తహసీల్దార్ పాండునాయక్, జిల్లా ఇంటర్ అధికారి వెంకటరమణ, కౌన్సిలర్ గౌరిశంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ.గోపాల్‌రెడ్డి, కట్ట అనంతరెడ్డి, కటకం రఘురాం పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభం..

పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సీబీఎం ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ప్రారంభించారు. విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ఆయన భోజనం చేశారు.

స్టేడియం అభివృద్ధికి కృషి..

అచ్చంపేట ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో వాకర్స్‌తో కలిసి ఎమ్మెల్యే వంశీకృష్ణ మార్నింగ్ వాక్ నిర్వహించారు. విడత వారీగా రూ.10కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామని, రాత్రి వేళ క్రికెట్ ఆడే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్టేడియం అభివృద్ధికి హామీ ఇచ్చారని చెప్పారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా ప్రధాన రహదారిలోని టీ, టిఫిన్ సెంటర్ల సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

రెగ్యులరైజేషన్ చేయాలని వినతి



ప్రొ.కోదండరాంకు వినతిని అందజేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

కల్వకుర్తి టౌన్: ప్రభుత్వాసుపత్రులలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోదండరాంకు సోమవారం ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉద్యోగులు ఆయనను కలిశారు. 15 ఏళ్లుగా 107 మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నామని వివరించారు. ఈసీ మెంబర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉర్కొండ: మండలంలోని ఉర్కొండపేట ఆంజనేయస్వామిని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం దర్శించుకున్నాడు. సోమవారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మనోహర్‌రెడ్డి, నర్సిరెడ్డి, నాయకులు సదానందం గౌడ్, శ్రీనివాసులు, వెంకటేష్, రమేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ సంస్మరణ సభకు ఆర్థిక సాయం



కల్వకుర్తిరూరల్: ప్రజాయుద్ధనౌక దివంగత గద్దర్ సంస్మరణ సభను ఈ నెల 26వ తేదీన పట్టణంలోని పార్థసారథి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు తాండ్రా గ్రామానికి వెళ్లి సంస్మరణ సభకు హాజరు కావాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఆశాదీప్‌రెడ్డిని ఆహ్వానించారు. సభ ఏర్పాట్ల ఖర్చుల నిమిత్తం ఆశాదీప్‌రెడ్డి రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సైదులు యాదవ్, గోపాల్, అబ్దుల్, శేఖర్, మాలిక్, అంజి పాల్గొన్నారు.

తెలంగాణలో కళాకారులకు సముచిత స్థానం



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మన్ననూర్: కళలు, కళాకారులు, ఉద్యమకారులకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వెంకటరమణ, ఎంపీటీసీ రహీం అన్నారు. సోమవారం మన్ననూర్‌లోని ఓం చౌరస్తాలో పార్టీ నాయకులతో కలిసి వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ కళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముచిత స్థానం కల్పిస్తూ అవార్డులకు ఎంపిక చేయడం శుభపరిణామన్నారు. ఈ క్రమంలోనే దాసరి కొండప్పకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు, రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలు నగదు బహుమతి అందజేసి గౌరవించిందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు పంబలి బుచ్చయ్య, నాయకులు సత్యనారాయణ, అశోక్, శివాజీ, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారంలో వారం రోజుల కిందట బర్పటి బాల్‌సాయిలు నివాసం ఉంటున్న పూరి గుడిసెలో ప్రమాదవశాత్తు కాలిపోయింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మోపతయ్య నగదు, వంట పాత్రలు సమకూర్చారు. ఈ మేరకు గ్రామస్తులు సోమవారం బాధితులకు అందజేశారు. నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



అచ్చంపేటలో సమ్మె నోటీసు అందిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య పిలుపునిచ్చారు. సోమవారం పెద్దముద్దునూరు పీహెచ్‌సీలో ఏఎన్ఎంలతో కలిసి సమ్మెల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్మికుల, కర్షకులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని సోమవారం అచ్చంపేట మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి కార్యాలయంలోని సిబ్బందికి సమ్మె నోటీసును అందించారు. వేమయ్య, బాలస్వామి, ధర్మానాయక్, శ్రీనివాసులు, విష్ణు నాసరయ్య పాల్గొన్నారు.

మార్చాల మాజీ సర్పంచ్ మృతి



శ్రీనివాసాచారి(ఫైల్)

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల మాజీ సర్పంచ్ కారం చేడు శ్రీనివాసచారి(98) సోమవారం మృతి చెందాడు. 1959లో గ్రామ మొదటి సర్పంచ్‌గా పనిచేశారు. 15 సంవత్సరాలు పాటు సర్పంచ్‌గా సేవలు అందించారు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు, కార్యకర్తలు గ్రామానికి వెళ్లి ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా గుర్తించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తెలకపల్లి: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా గుర్తించాలని సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో మేట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలతో పాటు పనిచేస్తున్న మేట్లుగా కొనసాగుతూ కనీస గౌరవ వేతనం లేకుండా పనిచేస్తున్న సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గోపస్ లక్ష్మణ్, మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి నందిపేట భాస్కర్, సీనియర్ మేట్ల సంఘం మండల అధ్యక్షుడు చిన్న రాముడు, ఉపాధ్యక్షుడు పరుశరాములు, కార్యదర్శి అర్చన, జహంగీర్, దశరథం, బాలస్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

మండల వడ్డెర సంఘం ఏర్పాటు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో వడ్డెర సంఘం నాయకులు సోమవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పసుపుల నర్సింహా, ఉపాధ్యక్షుడిగా మల్లేష్, మద్దిలేటీ, కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా మల్లేష్, వీరితో పాటు కమిటీ సభ్యులను, సలహాదారులను ఎన్నుకున్నారు. కురుమూర్తి, వెంకటస్వామి, కుర్మయ్యలు పాల్గొన్నారు.

సెలవుదినంగా ప్రకటించాలని ఎమ్మెల్యేకు వినతి

కందనూలు: సంత్ సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిని గిరిజన ఉద్యోగుల సంఘం, సేవాలాల్ ఉత్సవ కమిటీల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ టౌన్ ఉత్సవ కమిటీ సభ్యులు రాముడు నాయక్, సీతారాం నాయక్, దాసు నాయక్, వాలేందర్ నాయక్, రాజేష్ నాయక్, శంకర్ నాయక్, బాలాజీ నాయక్, తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

కొల్లాపూర్: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఫిబ్రవరి 15 వతేదీన సెలవుదినంగా ప్రకటించాలని కోరుతూ హైదరాబాద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావుకు గిరిజన సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ హన్మంతునాయక్, శంకర్‌నాయక్, బోజ్యానాయక్, లోక్యానాయక్, గోపినాయక్ తదితరులున్నారు.

కేసు నమోదు

చారకొండ: మండలంలోని గోకారం వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ రాజశేఖర్ వివరాల ప్రకారం మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన జమ్ముల సుల్తాన్ గోకారం వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. మండలంలోని తిమ్మాయిపల్లి వద్ద ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. ఇసుక తరలింపునకు అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

చారకొండ: సీఎం రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలకు ఖండిస్తూ సోమవారం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు చండీశ్వర్, నాయకులు బాలయ్య, రవి, గంగరాజు, మహేష్, గణేష్, రమేష్, మహేందర్, సాయికుమార్ ఉన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

చారకొండ: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై సోమవారం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. శంకర్, కొండలయ్య, వెంకటయ్య, అంజయ్య,లక్ష్మణ్, సత్తార్, లింగాచారి, శ్రీను తదితరులు ఉన్నారు.

వివరాలు నమోదు చేయించుకోవాలి

ఉప్పునుంతల: ఉచిత విద్యుత్ పథకానికి గృహ విద్యుత్ వినియోగదారులు వివరాలను ఆపరేటర్‌తో బిల్లు మిషన్‌లో విధిగా నమోదు చేయించుకోవాలని మండల ట్రాన్స్‌కో ఏఈ అమర్‌సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి యజమాని సెల్‌ఫోన్, రేషన్‌కార్డు, ఆధార్ నంబర్లు విధిగా బిల్లు మిషన్‌లో నమోదు చేయించుకోవాలని ఆయన తెలిపారు. విద్యుత్ కనెక్షన్ యజమాని పేరిట ఉన్నప్పటికీ ఇండ్లలో అద్దెకు ఉంటున్నవారు వారి వివరాలనే బిల్లు మిషన్‌లో నమోదు చేయించాలని ఏఈ సూచించారు.

ప్రజావాణికి గైర్హాజరు

చారకొండ: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అధికారులు గైర్హాజరయ్యారు. ఈ విషయమై తహసీల్దార్ ప్రమీలను సంప్రదించగా రెండు వారాల నుంచి అధికారులు ప్రజావాణికి హాజరుకావడం లేదని వివరించారు. దీంతో తాను కలెక్టరేట్‌లో ప్రజావాణిలో పాల్గొనేందుకు వెళ్తున్నానని ఆమె పేర్కొన్నారు. అధికారుల గైర్హాజరుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆమె పేర్కొన్నారు.

నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం తగదు



కల్వకుర్తిరూరల్: నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. సోమవారం మండలంలోని ఎల్లికల్, ముకురాల, తోటపల్లి గ్రామాల పరిధిలో ఉన్న నర్సరీలను పరిశీలించారు. ఎల్లికల్ గ్రామ పంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏపీఓ చంద్రసిద్ధార్థ్ ఉన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన



ఇంద్రకల్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థినులు

తాడూరు: మండలంలోని ఇంద్రకల్, యత్మతాపూర్, తుమ్మలసూగురు, ఐతోల్ గ్రామాల్లో రైతులకు సోమవారం ఆధునిక వ్యవసాయం పద్ధతులపై కేవీకే పాలెం రావేఫ్ విద్యార్థినులు అవగాహన కల్పించారు. ఎరువుల వాడకం, విత్తనాల ఎంపిక, పంటల సాగుకు ఆశించిన చీడపీడల నివారణ, వివిధ అంశాలకు సంబంధించిన వివరాలను అర్థమయ్యే రీతిలో వివరించారు. గ్రామీణ వ్యవసాయం, అనుభవ కార్యక్రమాలపై రైతులతో మమేకమై పంట పొలాల్లో తిరుగుతూ అధునాతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. మందులను పిచికారి చేయడం, రసాయనిక ఎరువుల వాడడం తగ్గించడం, సేంద్రియ ఎరువులపై దృష్టి నిలపాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రావేఫ్ విద్యార్థులు శ్రీలక్ష్మీరెడ్డి, స్వాతి, వర్షిత, శిరీష, సుభాతరుణ తదితరులు పాల్గొన్నారు.

స్పెల్ విజార్డ్–డ్రామా పోటీలు



ప్రశ్నాపత్రం విడుదల చేస్తున్న హెచ్‌ఎం శేఖర్

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఆంగ్ల భాషపై విద్యార్థులకు మండల స్థాయి స్పెల్ విజార్డ్–డ్రామా కాంపిటేషన్ పోటీలను నిర్వహించారు. ఈఎల్‌టీపీ సహకారంలో ఆంగ్ల ఉపాధ్యాయుడు ఆంగోతు శ్రీనునాయక్ ఆధ్వర్యంలో ఈ పోటీలలో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కస్తూర్బా విద్యాలయం, ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పోటీ పరీక్షలకు హాజరయ్యారు. విద్యార్థి కె.శివ మొదటి స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బల్మూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తుమ్మెన్‌పేట, గోదల్, కొండనాగుల విద్యార్థులకు స్పెల్ విజార్డు, డ్రామా పోటీలు నిర్వహించారు. తుమ్మెన్‌పేట విద్యార్థి గణేష్ ప్రథమస్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీరాం తెలిపారు. అదేవిధంగా డ్రామా విభాగంలో ప్రతిభ కనబర్చారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ఇంగ్లీష్ లాంగ్వేజెస్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పెల్ విజార్డు, డ్రామా పోటీలు నిర్వహించారు. గౌరెడ్డిపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం అంజలి ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. డ్రామా కాంపిటీషన్ పోటీలు అదే పాఠశాలకు చెందిన సాయితేజ, చింటూ, రామాంజనేయులు, చందు సాగర్, చరణ్ తేజలు ప్రతిభ చాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.

కార్మికుల సమ్మెను విజయవంతం చేయండి



పెంట్లవెల్లి వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు

పెంట్లవెల్లి: దేశవ్యాప్తంగా ఈ నెల 16 నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఈశ్వర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆశావర్కర్లు డాక్టర్ చంద్రశేఖర్‌కు సమ్మెనోటీసు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెన్షన్, ఈఎస్‌ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు శ్రీదేవి, శివలీల, మమత, నిర్మల, గౌరమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

తెలకపల్లి: ఈ నెల 16న నిర్వహించే సమ్మెలో పాల్గొంటునట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌కు ఆశావర్కర్లు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోపస్ లక్ష్మణ్, విజయ్‌గౌడ్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు నెరవేరుస్తాం



మాట్లాడుతున్న నర్సింహనాయుడు

పెంట్లవెల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను తప్పకుండా నెరవేరుస్తుందని మండల అధ్యక్షుడు నర్సింహ యాదవ్ అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు చేసిందేమీలేదని విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహనాయుడు, నరేష్, రాజు, డిష్ రవి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు

వెల్దండ: మండలంలోని గొల్లోనిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. హెచ్‌ఎంగా సాయిగణేష్, ఎంఈఓగా కల్యాణ్, డీఈఓగా శ్రీకాంత్‌తో పాటు మరో 15 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎంగా రవి, ఉపాధ్యాయురాలు పావని, యాదగిరి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పాఠశాలకు మైకు వితరణ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు మైక్‌సెట్‌ను క్లాస్‌ఎట్ క్లబ్, ఆవోపా నాయకులు పాఠశాలకు మైక్‌సెట్‌ను ప్రధానోపాధ్యాయులు మద్దిలేటికి అందజేశారు. దాతలకు రాఘవేందర్, కోదండరాం, శ్రీకాంత్, ప్రకాశ్‌లకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ, మాజీ వార్డు సభ్యులు ఎల్లయ్య, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ

బల్మూర్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ సంస్థ సభ్యుడు బిక్కిచంద్రకాంత్ రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీ చేసిన రికార్డులను సీల్ చేసి జిల్లా అధికారులకు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టంలో వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేసినట్లు తెలిపారు. సంస్థ సభ్యులు ఆంజనేయులు,శివప్రసాద్, బోట్కా మాలరాజు, బత్తుల విష్ణు, సీసీఆర్ సభ్యులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

అచ్చంపేట రూరల్: నకిలీ విత్తనాలు అమ్మితే డీలర్లపై చర్యలు తీసుకుంటామని ఏడీఏ చంద్రశేఖర్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని మండల వ్యవసాయాధికారి కార్యాలయ ఆవరణలో డీలర్లకు యాసంగి సీజన్‌కు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లైసెన్సులను సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలన్నారు. దుకాణం వద్ద స్టాక్ బోర్డు, ధరల పట్టికను కచ్చితంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణయ్య, డీలర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

కందనూలు: ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కోసం జిల్లా కేంద్రంలో భవనం ఏర్పాటుకు స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే రాజేష్ రెడ్డికి ఆ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వం పీజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు సీనియర్లు స్వాగతం పలికారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్, అమృత్‌కుమార్, దేవరాజ్, పుట్ట శ్రీను, వెంకటేశం తదితరులున్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన



పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై ఎస్‌ఐ రామన్‌గౌడ్ సోమవారం అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకు వివరాలు చెప్పొద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.